శ్రీ వారాహి సిల్క్స్

| | |
|---|---|
| **కంచిపట్టు**<br>(5000లకు పైగా డిజైన్స్) | **ఫ్యాన్సీ శారీస్**<br>(5000లకు పైగా డిజైన్స్) |
| **ధర్మవరం పట్టు**<br>(2500లకు పైగా డిజైన్స్) | **డిజైనర్ శారీస్**<br>(5000లకు పైగా డిజైన్స్) |
| **మంగళగిరి పట్టు**<br>(5000లకు పైగా డిజైన్స్) | **వర్క్ శారీస్**<br>(2500లకు పైగా డిజైన్స్) |
| **ఉప్పాడ పట్టు**<br>(2500లకు పైగా డిజైన్స్) | **ప్యూర్‌సిల్క్**<br>(5000లకు పైగా డిజైన్స్) |
| **బెనారస్ పట్టు**<br>(2500లకు పైగా డిజైన్స్) | **ప్రింటెడ్ సిల్క్**<br>(2000లకు పైగా డిజైన్స్) |
| **కుబేర పట్టు**<br>(5000లకు పైగా డిజైన్స్) | **లంగావోణీ సెట్‌లు**<br>(2000లకు పైగా డిజైన్స్) |
| **ఆర్‌గంజి పట్టు**<br>(2000లకు పైగా డిజైన్స్) | **లెహంగాస్**<br>(2000లకు పైగా డిజైన్స్) |
| **కేటలాక్ శారీస్**<br>(2000లకు పైగా డిజైన్స్) | |

**రూ.5000/-**
**షాపింగ్ చేయండి..**



**వెండి కాయిన్ పొందండి.**

# AASHADAM SALE



కృష్ణాపార్క్ దగ్గర, పాలకొండ రోడ్డు, శ్రీకాకుళం

సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
శుక్రవారం 11-7-2025
సంపుటి: 21 సంచిక: 93
పేజీలు: 8 వెల: రూ.1

## వైకాపా నాయకుడు దారుణ హత్య



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)
ఎచ్చెర్ల మండలం ఫరీదుపేట గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు, విద్యాకమిటీ మాజీ చైర్మన్ సత్తారు గోపి (46) శుక్రవారం దారుణ హత్యకు గురయ్యారు. ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి ముఖ్య అనుచరుడుగా ఉన్న గోపి ఎచ్చెర్ల నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా, గుర్తు తెలియని వ్యక్తులు కొయిరాల జంక్షన్ వద్ద దారి కాసి మారణాయుధాలతో హత్య చేసినట్ల సమాచారం. దుండగులు తలపై కొట్టడంతో తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. గోపి భార్య సుగుణ గ్రామ ఉపసర్పంచ్ కాగా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గోపి హత్యతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దాడి చేసిన వారి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. గత ఏడాది ఆగస్టు 18న అదే గ్రామానికి చెందిన ప్రసాద్ అనే యువకుడిపై కొందరు దాడి చేసి గాయపరిచారు. తీవ్రంగా గాయపడిన ప్రసాద్ అదే నెల 24న మృతి చెందాడు.



- టెక్కలి ఏఆర్టీ సెంటర్‌లో ఆ ఇద్దరిదే పెత్తనం
- మెడికల్ ఆఫీసర్‌ను ఖాతరు చేయకుండా ఇష్టారాజ్యం
- రోగులపై రుబాబు.. వ్యక్తిగతంగా వేధింపులు
- ఉచితంగా ఇవ్వాల్సిన ఔషధాలకు వసూళ్లు
- అప్పుడు వైకాపా చెంతన.. ఇప్పుడు టీడీపీ పంచన

# ఆ 'మందు' పోస్తేనే..
# ఈ మందులు ఇస్తాం!



కణితి విశ్వనాధం సంస్మరణ సభలో పైల వెంకటరమణ, సురేష్

**మీ ప్రాణాలను రక్షించే మందులు కావాలంటే మాకు ఆ మందు పోయించండి లేదా రూ.వెయ్యి రూపాయలు ఇవ్వండి. మరో మంచి ఆఫర్ ఉందండోయ్!.. పేషెంట్ రాకపోయినా, అసలు ఈ ఊరివారు కాకపోయినా ఫర్వాలేదు. వారి చేతులు తడిపితే చాలు.. పోస్టులోనో కొరియర్‌లోనో అవసరమైన ఔషధాలు పేషెంట్ల చెంతకు చేరిపోతాయి. ఇదీ టెక్కలి ప్రభుత్వ ఆస్పత్రిలో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు సేవలు అందించాల్సిన ఏఆర్టీ(యాంటీ రెట్రోవైరల్ థెరపీ) సెంటర్‌లో జరుగుతున్న దందా. కౌన్సెలర్ల ముసుగులో ఉన్న ఓ ఇద్దరు సాగిస్తున్న ఈ వసూళ్ల పర్వం మొత్తం సెంటర్‌కు చెడ్డపేరు తెస్తోంది. ఇదే కాదు.. మద్యం సేవించి రావడం, మెడికల్ ఆఫీసర్‌నే ఖాతరు చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించడం వీరికి నిత్యకృత్యం.**

డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి

'నేను ఒక రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగిని. హెచ్ఐవీ సోకి ప్రతినెలా టెక్కలి ఏఆర్టీ సెంటర్‌కు వెళ్తున్నాను. అయితే ప్రతి నెలా మద్యం బాటిల్ ఇస్తే తప్ప మందులు ఇచ్చేదిలేదంటూ అక్కడి కౌన్సెలర్లు ఇబ్బంది పెడుతున్నారు. మద్యం బాటిల్ తీసుకురాకపోతే రూ.వెయ్యి ఇవ్వాలని డిమాండ్' చేస్తున్నారు'. టెక్కలి ఏఆర్టీ సెంటర్‌పై ఒక బాధితుడి ఫిర్యాదు, ఆవేదన ఇది. ఆయనొక్కరే కాదు చాలామంది పేషెంట్లు ఇలాగే బాధితులుగా మారుతున్నారు. వ్యాధితో బాధ పడుతూ మందుల కోసం వెళితే.. ఆ కేంద్రంలోని ఇద్దరు కౌన్సెలర్లు దోపిడీకి పాల్పడుతూ మరింతగా బాధపెడుతున్నారని అనేకమంది రోగులు ఆవేదన, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే హెచ్ఐవీ బాధితులు. చాలామంది అవగాహన లేక వారిని చిన్నచూపు చూస్తుంటారు. దాంతో కొత్తవారి వద్దకు వెళ్లడానికి వారు జంకుతుంటారు. అందుకే కౌన్సెలర్లు డబ్బులు డిమాండ్ చేస్తున్నా అధికారుల వద్దకు వెళ్లి ఫిర్యాదు చేయడానికి భయపడుతున్నారు. ఫిర్యాదు చేసినా చర్యలు ఉండవేమోనన్న అనుమానం కూడా వారిని వెనక్కి లాగుతోంది. తమను ఇబ్బంది పెడుతున్నవారికి రాజకీయ, అధికరపరంగా పరిచయాలు ఉండటమే దీనికి కారణం.

### కౌన్సెలర్లా.. కామందులా..?!

### 1870 మంది పేషెంట్లకు సేవలు

ఎయిడ్స్ నియంత్రణ ప్రాజెక్టులో భాగంగా టెక్కలి ప్రభుత్వ జనరల్‌ఆస్పత్రి ఆవరణలోనే హెచ్ఐవీ, ఎయిడ్స్ రోగులకు సేవలందించేందుకు ఏఆర్టీ సెంటర్ పని చేస్తోంది. రోగులకు కౌన్సెలింగ్ చేయడం, టెస్టు చేయించడం, మందులు ఇవ్వడం వంటి బాధ్యతలు నిర్వర్తించే ఈ కేంద్రం ద్వారా చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన 1870 మంది సేవలు పొందు తున్నారు. వీరిలో వందమంది వరకు ఎక్స్ సర్వీస్‌మెన్ ఉన్నారు. రోగులకు నెలకోసారి మందులు ఇస్తుంటారు. అలాగే రెండు నెలలకోసారి టెస్టులు చేస్తుంటారు. పరిస్థితిని బట్టి కౌన్సెలింగ్ ఇస్తారు. ఆ విధంగా ప్రతిరోజు ఈ కేంద్రానికి 80 మంది వరకు రోగులు వస్తుంటారు. కేంద్రంలో ఒక మెడికల్ ఆఫీసర్, నలుగురు కౌన్సెలర్లు, ఒక స్టాఫ్ నర్సు, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు ఉన్నారు. ఒక ఫార్మాసిస్ట్ ఉండాల్సి ఉండగా, ఆ పోస్టు ఖాళీగా ఉంది. వీరిలో పైలా వెంకటరమణ అలియాస్ నేతాజీ అనే ఏఆర్టీ కౌన్సెలర్, సురేష్ అనే పీపీటీసీటీ అంటే.. చిన్నపిల్లలు, బాలింతలకు సేవలు అందించే కౌన్సెలర్ కలిసి ఈ కేంద్రాన్ని విచ్చలవిడిగా వాడేసుకుంటున్నారు. మెడికల్ ఆఫీసర్‌ను ఖాతరు చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ కేంద్రానికి వచ్చే పేషెంట్లను మందులు ఇచ్చే విషయంలో ఇబ్బందిపెడుతున్నారు. డబ్బులు దండుకుంటున్నారు. అలాగే వారి కుటుంబ, వ్యక్తిగత విషయాలు తెలుసుకుని వారి బలహీనతలతో






కణితి విశ్వనాధంతో పైల వెంకటరమణ



మంత్రి అచ్చెన్నాయుడు పర్యటనలో పక్కనే పైల

- మిగతా చివరి పేజీలో

## స్కిల్ డెవలప్మెంట్ పెంపొందించుకుంటే
# జీవితాల్లో వెలుగు నింపుతుంది




- పెరిగే జనాభాకు అవసరమైన వసుతు పెంపొందించాల్సిన అవసరం ఉంది
- జిల్లా ఎంప్లాయ్మెంట్ అధిపతి కె.సుధ
- ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)
ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు) శ్రీకాకుళంలో అర్థశాస్త్ర విభాగం, మేరా యూత్ భారత్, జాతీయ సేవాపథకం-1 ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం వేడుకగా నిర్వహించారు. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ వై.పోలినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎంప్లాయ్మెంట్ అధిపతి కె.సుధ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచంలో జనాభా కొన్ని దేశాల్లో పెరుగుతుండగా, కొన్ని దేశాల్లో తగ్గుతుందని, పెరిగే జనాభాకి అవసరమైన మౌలికమైన వసతులు పెంపొందించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థులు స్కిల్ డెవలప్మెంట్ పెంపొందించుకుంటే తమ జీవితాల్లో వెలుగు నింపుతుందన్నారు. మేర యూత్ భారత్ డిప్యూటీ డైరెక్టర్ కె.ఉజ్వల్ వెంకట్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌ని పెంపొందించుకోవాలన్నారు. కళాశాల అర్థశాస్త్ర విభాగాధిపతి సీహెచ్ రామమూర్తి మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల రేటు తగ్గుతుందని, దానివలన మానవ వనరులు తగ్గుతాయన్నారు. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ వై.పోలినాయుడు మాట్లాడుతూ జనాభా గుణొత్తర శ్రేణిలో పెరిగితే వ్యవసాయ ఉత్పత్తులు అంకశ్రేణిలో పెరిగి వనరుల కొరత ఏర్పడుతుందన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎం.వి.సత్యనారాయణ మాట్లాడుతూ జనాభా పెరగడం వల్ల ఉత్పన్నమయ్యే సమస్యల గురించి వివరించారు. ఆంగ్ల విభాగాధిపతి రాజశేఖర్ మాట్లాడుతూ జపాన్, కొరియా, చైనా దేశాల్లో 65 సంవత్సరాలు దాటిన జనాభా ఎక్కువగా ఉండటం వల్ల వారు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. కళాశాల తత్వశాస్త్ర అధిపతి వి.వెంకటరావు మాట్లాడుతూ త్వరలో జరగబోయే జనగణన కుల ప్రాతిపదికగా డిజిటల్ పద్ధతిలో ఉంటుందన్నారు. జాతీయ సేవా విభాగం ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్ పాత్రో మాట్లాడుతూ మన దేశంలో యువత ఎక్కువగా ఉందని, వారిని సక్రమమైన పద్ధతిలో వినియోగిస్తే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కె.వాసు దేవరావు, ఆర్.రవిశంకర్ చంద్రభూషణ్, వరలక్ష్మి, పీవీ రమణ, రామకృష్ణ, అరుణకుమారి, సూరి బాబు, మణికుమార్, చిన్నారావు తదితర అధ్యాపకులు పాల్గొన్నారు. 2025 సంవత్సరంలో రాష్ట్రస్థాయి పీజీ సెట్‌లో 26, 37 ర్యాంకుల పొందిన ప్రేమ్‌కుమార్, యశ్వంత్ ఈ సందర్భంగా బహుమతులకు అందజేశారు.



సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా నరసన్నపేట పట్టణం 12,13 వార్డుల పరిధిలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఇంటింటికి వెల్లి కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులకు చెప్పి పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకురాలు, సమన్వయకర్త బగ్గు అర్చన, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ రొణంకి కృష్ణంనాయుడు, పట్టణ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.
- సత్యంన్యూస్, నరసన్నపేట



## కుటుంబ నియంత్రణ పాటిద్దాం
# జనాభాను అరికడదాం

- మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే గర్భధారణ గురించి ఆలోచించాలి
- జనాభాపరంగా మనం చైనాను అధిగమించాం
- చిన్న కుటుంబాలు వున్ననాడే దేశం పురోభివృద్ధి
- డిఎంహెచ్ఓ డాక్టర్ కె.అనిత

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)
ప్రజలు కుటుంబ నియంత్రణ పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కె.అనిత అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఏటా జులై 11న ప్రపంచ జనాభా దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ ఏడాది మహిళలు శారీరకం గా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే గర్భధారణ గురించి ఆలోచించాలని తెలియజేసిందన్నారు. చిన్న కుటుంబాలు వున్ననాడే దేశం పురోభివృద్ధి చెందుతుం దని, దీనికి ప్రజలు పూర్తిగా సహకరించి చిన్న కుటుం బాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరుకుందామ న్నారు. జనాభాపరంగా మన దేశం చైనాను అధిగమిం చిందని ఆమె అన్నారు. కాన్పుల మధ్య ఎడం, మొదటి కాన్పు కాస్త ఆలస్యం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కాపర్ టి, తాత్కాలిక గర్భనిరోధక సూది మందు మాత్రలు, నిరోద్ అందుబాటులో ఉన్నాయని, పూర్తి వివరాలు, సేవలకు గ్రామాల్లో ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. అత్యవసర గర్భనిరోధక మాత్రలు, అసురక్షిత సంభోగం జరిగిన 72 గంటల లోపు ఒక మాత్ర వేసుకోవాలన్నారు. గర్భనిరోధక మాత్రలు (మాల-ఎన్) నెలసరి అయిన 5వ రోజు నుంచి తప్పకుండా ప్రతి రోజు వేసుకోవాలని ఆమె అన్నారు. సరాసరి పెళ్లి వయస్సు పురుషులకు 25 సం వత్సరాలు, స్త్రీలకు 21 సంవత్సరాలు ఉన్నప్పటికి పురుషులలో 16.2 శాతం వివాహాలు 21 సంవత్సరాల లోపు, స్త్రీలలో 31.5 శాతం వివాహాలు 18 సంవత్స రాల లోపు జరుగుతున్నాయన్నారు. కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు కేవలం స్త్రీలకే పరిమితం కాకుండా, మగవారు కూడా స్త్రీలతో సహకరించడం వలన కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు అధికమించడంలో ముందుండి మగవారు కూడా వ్యాసెక్టమి ఆపరేషన్లు చేసుకోవడంలోను, భార్య గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవించినంత వరకు ఆమెకు అన్ని విధాలుగా తోడు, సహకారం అందించడం వల్ల తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండటానికి అవకాశం ఉందన్నారు. మేము పిల్లలం - అప్పుడే కాము తల్లులం, పెళ్లికి ఎందుకు తొందర - చదువుకో ముందర, చిన్న కుటుంబం - చింతలు లేని కుటుంబం, మొదటి బిడ్డ బడికి - రెండవ బిడ్డ ఒడికి, కుటుంబ సంక్షేమం - దేశ సౌభాగ్యం, కాన్పుల మధ్య ఎడం - తల్లి బిడ్డల ఆరోగ్యం, తాత్కాలిక కుటుంబ నియంత్రణ, పద్ధతులు పాటించండి-ఆరోగ్యంగా జీవిం చండి, బాల్య వివాహాలు వద్దు - సరైన వయస్సులో వివాహం ముద్దు, కుటుంబ నియంత్రణ పాటిద్దాం - జనాభాను అరికడదాం, పాటిద్దాం పాటిద్దాం- కుటుంబ నియంత్రణ పాటిద్దాం, ఆడపిల్లల సంఖ్యను పెంచు దాం- ఆడ, మగ సమతుల్యాన్ని సాదిద్దాం తదితర నినా దాలతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి ఏడు రోడ్ల వరకు వివిధ కళాశాల, ఆశా వర్కర్స్, వైద్య, ఆరోగ్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో డెమో అధికారి డిఐఓ డాక్టర్ రామదాసు, ఎస్ఓ రామనాగేశ్వరావు, ఎం.వెంకటేశ్వరరావు, హెల్త్ ఎడ్యుకే షన్ ఆఫీసర్ ఎస్.విజయలక్ష్మి, మంత్రి వెంకటస్వామి, ఆశా వర్కర్స్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



• ఎడిటోరియల్

# అకటా.. ట్రంప్ శాంతిదూతట!

ట్రంప్‌కు నోబెల్ బహుమతి!.. అదీ శాంతి స్థాపనకు కృషి చేసినందుకు!! అవునా.. ఇది నిజమా! ఇదేం పోయేకాలం!! అని నిందించకండి.. ఇంకా అంత దారుణం జరగలేదు గానీ.. ఏమో గుర్రం ఎగరావచ్చు.. అన్నట్లు జరిగినా జరగవచ్చు. ఎందుకంటే.. డోనాల్డ్ ట్రంప్ ప్రపంచంలో ప్రస్తుతం నెలకొన్న అణు ఉద్రిక్తతలను అడ్డుకుని శాంతిస్థాపనకు సర్వశక్తులూ ఒడ్డి కృషి చేస్తున్నారట. అందుకే ఆయనగారి పేరును నోబెల్ శాంతి బహుమతి కోసం అమెరికా అనంగు మిత్ర దేశాలైన పాకిస్తాన్, ఇజ్రాయెల్ ప్రతిపాదించాయన్న వార్తలు అణుబాంబు పేలినంత భీకర విస్ఫోటనం సృష్టించి యావత్తు ప్రపంచం చెవులు మూసుకునేలా చేశాయి. ట్రంప్ పేరుతో నామినేషన్లు అందినట్లు నోబెల్ కమిటీ వర్గాలు కూడా ధ్రువీకరించాయి. ప్రపంచవ్యాప్తంగా శాంతిస్థాపనకు కృషి చేస్తున్నందుకు గాను ఇజ్రాయెల్, భారత్-పాక్ మధ్య ఇటీవల చెలరేగిన సైనిక ఘర్షణలను నివారించినందుకుగాను పాకిస్తాన్ శ్రీమాన్ ట్రంప్‌గారు నోబెల్ శాంతి బహుమతికి అన్ని విధాలా అర్హుడని పేర్కొంటూ నామినేట్ చేశాయని ఆ వర్గాలు వెల్లడించాయి. ట్రంప్ ఈ అత్యున్నత పురస్కారానికి నామినేట్ కావడం ఇదే తొలిసారి కాదు. గతంలోనూ అమెరికాలోని రిపబ్లికన్ సెనేటర్లు, అలాగే నార్వే న్యాయరంగానికి చెందిన కొందరు ఉత్తర కొరియ వల్ల అణు ఉద్రిక్తతలను ఉపశమింపజేసినందుకు గాను 2018లో ట్రంప్‌ను నోబెల్‌కు నామినేట్ చేశారు. అలాగే మధ్యప్రాచ్యంలో రేగిన ఉద్రిక్తతలను చల్లార్చేందుకు కృషి చేశారంటూ 2021లో కూడా నార్వేకు చెందిన కొందరు ట్రంప్‌ను సిఫార్సు చేశారు. తాజాగా తనపేరు మళ్లీ నామినేట్ కావడంపై ట్రంప్ స్పందిస్తూ అసలు ఈ అవార్డు తనకు ఎప్పుడో రావాల్సిందని ఉవాచించారు. వాస్తవానికి నోబెల్ విజేతల ఎంపిక ప్రక్రియ చాలా సుదీర్ఘంగా రహస్యంగా జరుగుతుంది. ఈ బహుమతులకు అర్హులను నామినేట్ చేయడమనేది ఈ ప్రక్రియలో కేవలం ప్రాథమిక చర్య మాత్రమే. కానీ అత్యున్నతమైన, ప్రతిష్టాత్మకమైన నోబెల్ శాంతి బహుమతికి అర్హులుగా ఒకరి పేరును ప్రతిపాదించడమంటే.. వారు ఎంతో నిస్వార్థంగా వ్యవహరిస్తూ, రాగద్వేషాలకు అతీతంగా ప్రపంచ స్థాయిలో శాంతి, సౌభ్రాతృత్వాలు వెల్లివిరిసేందుకు, యుద్ధ ఉద్రిక్తతలను ఉపశమింపజేసేందుకు కృషి చేసినవారై. శాంతిదూతలుగా అంతర్జాతీయ గుర్తింపు, మన్ననలు పొంది ఉండాలి. కానీ ఏకంగా మూడుసార్లు శాంతి బహుమతికి నామినేట్ అయిన ట్రంప్ ఏ రకంగా ఆ పురస్కారానికి అర్హుడని భావించారో అర్థం కావడంలేదు. ట్రంప్ ఆ స్థాయికి ఎదిగారా, లేక నోబెల్ స్థాయిని తగ్గించేస్తున్నారా? అన్న అనుమానాలు, ఆవేదన వ్యక్తం కాకమానవు. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి వెలగబెడుతున్న డోనాల్డ్ ట్రంప్ తెంపరితనం, వాచాలత, స్వార్థచింతన, పెత్తందారీ ధోరణి ఎలాంటివో ప్రపంచ దేశాలన్నింటికీ బాగా తెలుసు. వాటిలో చాలా దేశాలకు అవి అనుభవైకవేద్యమే. ఎందుకంటే చాలా దేశాలు ఆయన బాధితులే. ప్రపంచంలో ఏకైక అగ్రరాజ్యంగా అమెరికాకు అధ్యక్షుడి హోదాలో ఇతర దేశాలన్నింటిపైనా పెత్తనం చెలాయించేందుకు ట్రంప్ నిత్యం ప్రయత్నిస్తుంటారు. ఆయన ప్రతి చర్యలోనూ అమెరికా సొంత ప్రయోజనాలే ఇమిడి ఉంటాయి. అణు ఉద్రిక్తల ఉపశమనానికి ఆయన కృషి చేస్తున్నారన్నది పూర్తిగా అవాస్తవం. అమెరికా అణు విధానాలను, ఆయుధ సార్వభౌమత్వానికి ఎదురెల్లకుండా ఇతర దేశాలను అణచివేసే ధోరణే తప్ప.. ప్రపంచ శాంతి కోసమన్నది ఉత్తి భ్రమ. మూడేళ్లకుపైగా సాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ఇంతకాలం ఆయుధాలు సరఫరా చేసి ఎగదోసింది ఈ అమెరికానే.. ఏడాదికాలంగా ఈ పని చేస్తున్నది ఈ ట్రంప్‌గారు. తీరా ఇప్పుడు తన మాటలు మన్నించి రాజీచర్చలకు రానందుకు హుంకరిస్తూ ఉక్రెయిన్‌కు మళ్లీ ఆయుధాలు సరఫరా చేస్తామని ట్రంప్ హెచ్చరించారు. మరోవైపు ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధ సమయంలో ఒకపక్క చర్చలు, శాంతి మంత్రం జపిస్తూనే.. మరోవైపు ఇరాన్‌లోని భూగర్భ అణుశుద్ధి కేంద్రాలపై తమ యుద్ధ విమానాలతో దాడులు చేయించారు. ఇక ఆపరేషన్ సింధూర్‌ను తానే ఆపించి శాంతిస్థాపనకు కృషి చేశానని ప్రకటించుకున్న ట్రంప్.. కొద్ది రోజులకే పాక్ సైన్యాధ్యక్షుడిని పిలిపించుకుని విందు చర్చలు జరిపారు. ఇక తన మాట వినని దేశాలపై ఏకపక్షంగా సుంకాలు భారీగా పెంచి వాణిజ్య యుద్ధానికి పాల్పడుతున్నారు. అటువంటి వ్యక్తి ప్రపంచ నాయకుడు, శాంతి దూత ఎలా అవుతారు? ఆయన్ను నామినేట్ చేయడం ఏమిటి?? ఆయన తీరు చూస్తే ఆ పురస్కారాన్ని ట్రంప్ బలవంతంగా తనకు ప్రకటించేలా చేసినా ఆశ్చర్యంలేదు. హతవిధీ!

# యిప్పిలిలో ఫ్రైడే-డ్రై డే నిర్వహణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మండలంలోని రూరల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని యిప్పిలి గ్రామంలో శుక్రవారం ఫ్రైడే -డ్రైడే కార్యక్రమం స్థానిక ఆరోగ్య సిబ్బంది నిర్వహించారు. ప్రాణాంతక అంటువ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, ఫైలేరియా, జపనీస్ ఎన్ సెఫలైటిస్ వంటి వ్యాధులకు కారణమైన దోమల వృద్ధిని అరికట్టి తద్వారా సంబంధించే అంటువ్యాధులునుండి ప్రాణాపాయం లేకుండా రక్షించేందుకు ప్రజలకు పెద్దఎత్తున అవగాహన కలిగించే కార్యక్రమమే ఫ్రైడే -డ్రైడే అని హెల్త్ అసిస్టెంట్ ఇప్పిలి చిట్టిబాబు తెలిపారు. ఈ కార్యక్రమం వైద్యాధికారులు డాక్టర్ టి.చిరంజీవి నాయుడు, డాక్టర్ బి.నమ్రతప్రియ ఆదేశానుసారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల్లో ఈకార్యక్రమం ఆరోగ్య విస్తరణ అధికారి గొర్లె రవికుమార్ పర్యవేక్షణలో జరుగుతున్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వున్నది వర్షాకాలం కావున ఈ కాలంలో వర్షంనీరు నిలువ కారణంగా తాగునీటి వనరులు కలుషితం అయితే డయేరియా, టైఫాయిడ్, కామెర్లు వంటి అంటువ్యాధులు వ్యాపించకుండా ప్రజలు కాచి చల్లార్చి వడకట్టిన నీటినే త్రాగాలన్నారు. అలాగే త్రాగు నీటి వనరుల వద్ద స్నానమాచరించడం, బట్టలు ఉతకడం, జంతువులను కడగడం, బహిరంగ మలవిసర్జన వంటివి చేయరాదన్నారు. అలాగే ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు నిలువ వుంటే దోమలు వృద్ధి చెంది అనేక అంటువ్యాధులు వ్యాపిస్తాయి కావున వర్షపునీరు నిలువకు కారణమైన ప్లాస్టిక్ గ్లాసులు, తాగి పడేసిన కొబ్బరిబొండాలు, పాత టైర్లు వంటి వాటిని తొలగించడంతోపాటు ద్వారాలకు కిటికీలకు దోమ తెరలు వాడాలని కోరారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రతి మూడవ శనివారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర వంటి కార్యక్రమాలపై ప్రజలు చైతన్యం కలిగివుండాలని, ఎటువంటి అంటువ్యాధులు వ్యాపించిన తక్షణం ఆరోగ్య సిబ్బందికి తెలియజేసి, ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందడం ద్వారా ప్రాణాపాయం నుండి రక్షణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎమ్ డి.సుజాత ఎంఎల్‌హెచ్‌పీ పి.కాంచన, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



# బదిలీ ఉపాధ్యాయులకు జూన్ నెల జీతాలు చెల్లించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



2025 జూన్ నెలలో జరిగిన రీ ఎపోర్షన్, ప్రమోషన్లు బదిలీల కౌన్సెలింగ్ కారణంగా కొత్త పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులలో కొంతమందికి నూతన క్యాడర్ స్ట్రెంత్ ప్రభుత్వ ఆమోదం ఇప్పటికీ పొందనందున ఆయా ఉపాధ్యాయులకు జూన్ నెల జీతాలు చెల్లించడం జరగలేదని, దాని కారణంగా వారి జీతాల ఖాతాల నుండి చేయవలసిన మినహాయింపులు, బ్యాంకులు తదితర సంస్థలకు చెల్లించాల్సిన ప్రీమియంలు చెల్లించలేకపోయారన్నారు. అంతేకాకుండా ఆర్థిక ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. కావున రాష్ట్ర అధికారులు వెంటనే స్పందించి నూతన క్యాడర్‌స్ట్రెంత్‌ను ఆమోదించి సంబంధిత అధికారులకు ఉపాధ్యాయుల జీతాల చెల్లింపునకు తక్షణ ఆదేశాలు ఇవ్వవలసిందిగా ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) పూర్వ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగినందున విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠ్యపుస్తకాలు విద్యా సామాగ్రి అందించాల్సిందిగా రాష్ట్ర విద్యాశాఖ అధికారులను కోరారు. విద్యారంగంలో అనవసర ప్రయోగాలు, బోధనేతర కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా, బోధనకు అవకాశం కల్పించి ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి కృషి చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.



బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావును ఆ పార్టీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాటికుప్పల సురేష్‌కుమార్, పిల్లా కన్ననాయుడులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని సన్మానించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘ జిల్లా ప్రచార కార్యదర్శి కిల్లి కుమారస్వామి, ఆమదాలవలస టీడీపీ యూనిట్ ఇంచార్జ్ కడగల కృష్ణ, పాతపట్నం బీజేపీ మండల అధ్యక్షులు పడాల షణ్ముఖరావు, హిరమండలం బీజేపీ మండల అధ్యక్షులు రెల్ల ఢిల్లీశ్వరరావు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, బీజేపీ నాయకులు పనుకు సూర్యనారాయణలున్నారు. – సత్యంన్యూస్, పాతపట్నం

# అరసవల్లిలో సుపరిపాలన తొలి అడుగు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలను తెలుసుకోవడం కోసమే సుపరిపాలనలో తొలి అడుగు లక్ష్యమని శాసనసభ్యులు గొండు శంకర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు చేపట్టిన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శ్రీకాకుళం నగర పరిధిలోని కాజీపేట, అరసవల్లిలో పార్టీశ్రేణులతో కలసి ఆయన పర్యటించారు. గ్రామాలలో ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, తొలి ఏడాది సాధించిన అభివృద్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారం చేపట్టిన ఏడాదిలోనే ఎన్నికలముందు ఇచ్చిన హామీలలో అధికశాతం అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. తాము ఇచ్చిన హామీలను అమలు చేశాం కాబట్టే ధైర్యంగా తొలిఅడుగుతో ప్రజల మధ్య వచ్చామని చెప్పారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షులు, వార్డు ఇన్‌చార్జ్‌లు, నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇన్‌చార్జిలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.



# అనుష్క ఇక బయటకు రాదా?

ఒకప్పుడు టాలీవుడ్‌లో నెంబర్ వన్ హీరోయిన్ ఎవరంటే అనుష్క పేరే చెప్పేవారు. క్రేజ్ పరంగా, పారితోషికం పరంగా.. తనే నెంబర్ వన్. అయితే ఇప్పుడు ఆ వైభవం, వైభోగం రెండూ పోయాయి. అనుష్క ని వెండి తెరపై చూసి చాలా కాలం అయ్యింది. సినిమా ఫంక్షన్లలో స్వీటీ కనిపిస్తే ఒట్టు. చివరిగా తాను ఓ ఈవెంట్ కి ఎప్పుడు హాజరైందో కూడా గుర్తే లేదు. బాహుబలి సినిమా విడుదలై పదేళ్లు అయిన సందర్భంగా బాహుబలి టీమ్ రీ యూనియన్ ఏర్పాటు చేసింది. రాజమౌళి, ప్రభాస్ తో సహా చాలామంది నటీనటులు, టెక్నీషియన్లు ఈ రీ యూనియన్ లో మెరిశారు. కానీ అనుష్క మాత్రం కనిపించలేదు. తన చేతిలో ఘాటీ అనే ఒకే ఒక్క తెలుగు సినిమా వుంది. ఈ సినిమా ప్రమోషన్లలో కూడా స్వీటీ కనిపించడబోవడం లేదని తెలుస్తోంది. అనుష్క లేకుండానే ఈ సినిమా ప్రమోషన్లని క్రిష్ అండ్ కో ప్లాన్ చేసిందని సమాచారం అందుతోంది.

అసలు స్వీటీకి ఏమైంది? సినిమా ప్రమోషన్లకు, ఈవెంట్లకు ఎందుకు రావడం లేదు? తన నుంచి ఒక్క లేటెస్ట్ పిక్ గానీ, వీడియో గానీ ఎందుకు చూడలేకపోతున్నాం? అని ఫ్యాన్స్ కూడా చాలా నిరుత్సాహానికి గురవుతున్నారు. స్వీటీ చాలాకాలం నుంచి వ్యక్తిగత సమస్యలతో బాధపడుతోంది. అందుకే సినిమా అవకాశాలూ తగ్గుతూ వస్తున్నాయి. వీటన్నింటికీ కారణం 'సైజ్ జీరో' అనే సినిమా. రాఘవేంద్రరావు తనయుడు ప్రకాష్ దర్శకత్వంలో 'సైజ్ జీరో' అనే ఓ సినిమా వచ్చిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఈ సినిమా కోసం స్లిమ్ గా ఉన్న అనుష్క కాస్త బొద్దుగా మారింది. అయితే ఆ సినిమా పూర్తయిన తరవాతి నుంచీ సన్నబడడానికి చేసిన ఏ ప్రయత్నమూ వర్కవుట్ కాలేదు. పైగా ఆ ప్రయత్నాలు అనుష్కని శారీరకంగా మరింత ఇబ్బంది పెట్టాయి. తను ఈమధ్య మరీ లావుగా మారిపోయిందని, ఆ రూపంతో బయటకు రావడం ఇష్టం లేకే.. ఇలా సినిమా ఈవెంట్లకు, ప్రమోషన్లకు డుమ్మా కొడుతోందని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

తాను షూటింగ్‌కి వచ్చినా సెట్లో చాలా తక్కువ మందే ఉండాలని అనుష్క కండీషన్ పెడుతోందట. సీజీలతో లావుగా ఉన్న అనుష్కని సన్నగా చూపించడానికి చాలా కష్టపడాల్సివస్తోందని, అనుష్క రెమ్యునరేషన్ కంటే తన సీజీల కోసమే నిర్మాతలు ఎక్కువ ఖర్చు పెడుతున్నారని ఇన్ సైడ్ వర్గాలు చెబుతున్నాయి. అయితే సన్నబడడానికి అనుష్క ఇప్పటికీ ప్రయత్నిస్తోందని, ఆ ప్రయత్నాలు సఫలీకృతమైతేనే స్వీటీ బయటు వస్తుందని, లేదంటే ఇలానే ప్రైవసీ కొనసాగిస్తుందని అంటున్నారంతా. అనుష్క బయటకు రాకపోవడానికి అసలు కారణం తెలిసి స్వీటీ ఫ్యాన్స్ కూడా ఫీలవుతున్నారు. అనుష్క ఎప్పుడు స్లిమ్ అవుతుందో.. ఎప్పుడు బయటకు వస్తుందో?

– తెలుగు 360.కామ్ సౌజన్యంతో...





# డెనిమ్స్‌లో మీనాక్షి సోయగాలు

అందంతో కవ్విస్తుంది.. ఫ్యాషన్ సెన్స్‌తో మురిపిస్తుంది. కాంపిటీషన్ ఎంత ఉన్నా, తననే ప్రజల కళ్లు వెంబడించే సెంటరాఫ్ అట్రాక్షన్‌గా నిలుస్తుంది. ఈ భామలో మల్టీ ట్యాలెంట్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇంతకీ ఎవరీ ముద్దుగుమ్మ? అంటే.. నిస్సంకోచంగా మీనాక్షి చౌదరి గురించే ఇదంతా. ఇప్పుడు మీనాక్షి బ్లూ డెనిమ్స్ లో గుబులు రేపే ఫోజులతో చెలరేగిపోయింది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ కుర్రకారు కంటికి కునుకుపట్టనీకుండా చేస్తోంది. మీనాక్షి బ్లూ అండ్ బ్లూ డెనిమ్ లుక్ లో ఎంతో సూపర్బ్ గా కనిపిస్తోందంటూ అభిమానులు ప్రశంసిస్తున్నారు. మీనాక్షి తన చేతికి బరువైన గాజులు, చెవికి కాంబినేషన్ జూకాల్ని ధరించి సంథింగ్ స్పెషల్ గా కనిపిస్తోంది. వెంకీతో 'సంక్రాంతికి వస్తున్నాం', మహేష్‌తో 'గుంటూరు కారం' లాంటి భారీ చిత్రాల్లో నటించిన మీనాక్షి చౌదరి, టాలీవుడ్ కోలీవుడ్ లో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించింది. హిట్ ది సెకండ్ కేస్, గోట్, లక్కీ భాస్కర్ లాంటి క్రేజీ చిత్రాల్లోను మీనాక్షి నటించింది. ఈ భామ నాగ చైతన్య సరసన ఓ చిత్రంలో నటిస్తోంది. అలాగే అనగనగా ఒక రోజు అనే చిత్రంలోను నటిస్తోంది. ఈ రోజుల్లో ఇండస్ట్రీలో నెగ్గుకు రావాలంటే, యూనిక్‌నెస్‌తో దూసుకురావాలని చెప్పే మీనాక్షి తనదైన యూనిక్‌నెస్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...

# బాహుబలి ది ఎపిక్: రన్ టైమ్ ఇదేనా..




భారతీయ సినిమా చరిత్రలో రికార్డు స్థాయిలో కలెక్షన్లు సాధించిన చిత్రాల్లో బాహుబలి ఓ సంచలనంగా నిలిచింది. రాజమౌళి దర్శకత్వంలో ప్రభాస్, రానా, అనుష్క, రమ్యకృష్ణ, నాజర్ లాంటి నటులతో తెరకెక్కిన ఈ రెండు భాగాల బాహుబలి సిరీస్ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది. "బాహుబలి: ది బిగినింగ్" – "బాహుబలి: ది కన్‌క్లూజన్"తో సూపర్ హిట్ సాధించిన రాజమౌళి, ఇప్పుడు అదే గాధను ఒకే భాగంగా మళ్లీ థియేటర్లలోకి తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ కాంబినేషన్‌కి ఉన్న క్రేజ్ బట్టి చూస్తే ఈ సినిమా ఇంకెంత హైప్ క్రియేట్ చేస్తుందో చెప్పక్కర్లేదు. 'బాహుబలి ది ఎపిక్' పేరుతో వచ్చే ఈ స్పెషల్ ఎడిషన్ సినిమాను వన్ షాట్‌గా రిలీజ్ చేయాలని మేకర్స్ భావిస్తున్నారని ఇప్పటికే తెలుస్తోంది. ఈ సినిమాకు సంబంధించి ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగిపోతుండగా, తాజాగా ఓ ఆసక్తికరమైన అప్డేట్ బయటకు వచ్చింది. ప్రముఖ టికెటింగ్ ప్లాట్‌ఫాం బుక్ మై షో వెబ్‌సైట్‌లో బాహుబలి ది ఎపిక్ మూవీ రన్ టైమ్‌ని చూపిస్తూ 5 గంటలు 27 నిమిషాలు (327 నిమిషాలు)గా నమోదు చేశారు. ఇది నిజమైన రన్‌టైమ్ అనేది క్లారిటీ లేని అంశం. ఒకవేళ ఇదే ఫైనల్ కట్ అయితే, ఇది భారతీయ సినిమా చరిత్రలోనే లాంగెస్ట్ ఫిలింగా నిలుస్తుందన్న మాట. అయితే ఇది కేవలం ప్లేస్‌హోల్డర్‌గా మాత్రమే ఉండొచ్చన్న అంచనాలు కూడా ఉన్నాయి. ఈ రన్ టైమ్ చూసిన ప్రేక్షకులు మొదట షాక్ అయ్యారు. అయితే ఇది రెండు భాగాలను కలిపి రూపొందించిన వెర్షన్ అని వివరణ ఇవ్వడంతో కొంత మేర ఊరట పడ్డారు. సాధారణంగా సినిమాల రన్ టైమ్ రెండు నుంచి మూడు గంటల మధ్యనే ఉంటే, ఇది దాదాపు అర రోజంతా సాగుతుంది. అందుకే ఇది థియేటర్లలో ఎలా వర్క్ అవుతుందో అన్న చర్చలు మొదలయ్యాయి. ఇంత పెద్ద రన్ టైమ్‌కి మల్టీపార్ట్ ఇంటర్వెల్స్, ఇంటరాక్టివ్ వెర్షన్ లేదా బ్రేక్‌తో ప్రదర్శించవచ్చన్న ఊహాగానాలు వస్తున్నాయి. బాహుబలి ఫ్యాన్స్ అయితే ఈ సినిమాను మరోసారి థియేటర్లో చూసే అవకాశం రావడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సినిమా అక్టోబర్ 31న విడుదల కానుంది. ఇప్పటికే ఈ పేజీలో 10 వేల మందికి పైగా "ఇంటరెస్టెడ్" అని ట్యాగ్ చేయడం చూస్తే హైప్ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. – తుపాకి.కామ్ సౌజన్యంతో...

# వైకాపా బలోపేతానికి 'కార్యకర్తే కీలకం"



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం క్యాంపు కార్యాలయంలో రణస్థలం మండలం అర్జునవలస గ్రామ పంచాయితీ కార్యకర్తలతో "కార్యకర్తే కీలకం" సమావేశంలో భాగంగా పదవరోజు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలన్నారు. కార్యకర్త కృషి ఎనలేనిదని, కార్యకర్త కోసం ఎంత చేసినా తక్కువేనన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నెన్నో హామీలు ఇచ్చి బూటకపు మాటల చెప్పి కాలయాపన చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలందరూ నిరాశ, నిస్పృహ చెందుతున్నారన్నారు. వైకాపా కార్యకర్తలను భయాందోళనకు గురి చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. వైకాపా ప్రభుత్వం అందించిన సంక్షేమం, కూటమి ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమాన్ని మధ్య తేడాను ప్రజలు గమనించాలన్నారు. పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలన్నారు. చంద్రబాబు చేస్తున్న మోసాలను గ్రామాలలో ప్రజలకు తెలియజేయాలన్నారు. ఎటువంటి సమస్య వచ్చిన నేరుగా నాకు సంప్రదించాలని వాటిని పరిష్కారం చేసే దిశగా అడుగులు వేస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి మీసాల రామునాయుడు, ఉప సర్పంచ్ రామిశెట్టి మహేష్, నాయకులు కొత్తకోట ఉత్తరకుమార్, సిరిపురపు శ్రీరామ్, కోట్ల అప్పలనాయుడు, నౌకోట్ల భీముడు, కాట తవుడు, గిరడ సన్యాసరావు, కొత్తకోట అప్పలనాయుడు, మీసాల లక్ష్మణరావు, కాళ్ళ రాజు, గిడిజాల సురేష్, పి.కృష్ణవేణి, గిడిజాల కృష్ణ, కోట్ల జనార్ధన, కోట్ల అప్పలస్వామి, మీసాల బాబురావు, రౌతు అప్పలనాయుడు, పుట్టేపు శ్రీను, డి.రాము, గిరడ రామారావు, గిరడ రామునాయుడు, కొత్తకోట ఆదినారాయణ, కొత్తకోట రమణ, కాళ్ళ సన్యాసిరావు, కొత్తకోట రాము, ఎన్.ప్రకాష్, ఎన్.ఎల్లయ్య, ఆర్.సన్యాసి రావు, టి.రాజారావు, తొత్తర రాము నాయుడు, ఆల్తి గోవింద, కొండపల్లి పెంటయ్య, గిడిజాల రామారావు, గిడిజాల అప్పలనాయుడు, పప్పల త్రినాధ, పొట్నూరు రమేష్, జి.క్రిష్ణయ్య, ఎ.బంగారినాయుడు, జి.రామలక్ష్మణ, ఎ.మహేశ్వరరావు, పి.రమేష్, జి.రామునాయుడు, ఆల్తి ఆచ్చంనాయుడు, పొట్నూరు రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.



వసుదైక కుటుంబం యూనివర్సల్ ఫ్యామిలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొల్లిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జె.లిద్దు, జి.హేమ, టి.పూజిత, జి.త్రివేణిలకు శుక్రవారం సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.రామారావు, సిబ్బంది, సర్పంచ్, గ్రామ పెద్దలు, ఎస్ఎంసీ చైర్మన్, సభ్యులు పాల్గొన్నారు. - సత్యంన్యూస్, శ్రీకాకుళం

# ప్రపంచ జనాభా దినోత్సవ అవగాహన




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో ఎకనామిక్స్, జువాలజీ విభాగాల యూత్ రెడ్‌క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో జెమ్స్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ భాగస్వామ్యంగా శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ, "ప్రపంచ జనాభా దినోత్సవం ద్వారా జనాభా పెరుగుదల, అభివృద్ధిపై ప్రభావం, ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన పెంచడం అవసరమన్నారు. జెమ్స్ హాస్పిటల్ నుండి పలువురు వైద్యులు పాల్గొన్నారు. డాక్టర్ అరవింద్ మాట్లాడుతూ జనాభా నియంత్రణ వల్ల అనేక లాభాలు ఉన్నాయన్నారు. కళాశాల ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి టి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ ఈ ఏడాది థీమ్ యువతకు న్యాయమైన ఆశాజనకమైన ప్రపంచాన్ని సృష్టించడంలో మద్దతు ఇవ్వడమేనన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.చిన్నారావు, అకడమిక్ కో-ఆర్డినేటర్ కె.మౌనిక, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి, డాక్టర్ బి.ప్రభాకర (ఎకనామిక్స్), ఐ.హేమ పద్మజ (జువాలజీ), డా. వర్ష, డా. రేవతి, డా. వై.రవికుమార్ తదితర అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళం నియోజకవర్గంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రకటించారు. ఈనెల 14న ఉదయం 9 నుండి స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ జాబ్‌మేళా జరుగుతుందన్నారు. సుమారు 10కంపెనీలు పాల్గొంటున్న ఈ మేళాద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యమన్నారు. 18 నుండి 30సంవత్సరాల వయస్సు గల, ఎస్.ఎస్.సి., ఇంటర్మీడియట్, ఐ.టి.ఐ., డిప్లొమా, డిగ్రీ, బి.ఫార్మసీ ఉత్తీర్ణులైన యువతీ, యువకులు ఈ జాబ్ మేళాకు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తప్పనిసరిగా naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని, రిఫరెన్స్ నంబర్‌తోపాటు రావాలని సూచించారు. అభ్యర్థులు తమ రెస్యూమ్, ఆధార్‌కార్డు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు ఒరిజినల్, జిరాక్స్ కాపీలు, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో తీసుకుని రావాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9704960160 లేదా 9550967353నంబర్‌లకు సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.



# ప్రజా మద్దతు వైకాపాకే

(సత్యంన్యూస్, నరసన్నపేట)

చంద్రబాబు తన మార్కు ష్యూరిటీ మోసాలతో ప్రజలను దారుణంగా వంచిస్తున్నారని టీడీపీకి ప్రజలే గ్యారంటీగా తగిన బుద్ధి చెబుతారని వైకాపా నాయకులు ఘాటుగా విమర్శించారు. నరసన్నపేట నియోజకవర్గంలోని ఎస్ఎల్‌విడి కళ్యాణమండపంలో శుక్రవారం జరిగిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఆసక్తికరంగా జరిగింది. ఈ సమావేశానికి యువ నాయకుడు డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య అధ్యక్షత వహించారు. జిల్లాపార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాం, జిల్లా పరిశీలకులు, ఎమ్మెల్సీ కుంబా రవిబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ "చంద్రబాబు తన హయాంలో గ్యారంటీ మోసాలు, ష్యూరిటీ పేరుతో పేద ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నారని, ఇలాంటివి మళ్లీ జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ధర్మాన కృష్ణదాస్ పేర్కొన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో జగనన్న పాలనతో పోల్చి చూస్తే సంక్షేమ పథకాలతో ప్రజలు ఎక్కడ సంతృప్తి వ్యక్తం చేయడం లేదన్నారు. ప్రతి ఒక్క కుటుంబానికీ ఆర్థిక స్థిరత్వం తీసుకువచ్చేలా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చక్కటి పాలన అందించగా, సూపర్ సిక్స్ సూపర్ సెవెన్ మోసాలతో టిడిపి ప్రభుత్వం ప్రజలను వంచించిందని తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కుంబా రవిబాబు మాట్లాడుతూ ప్రజలు వైకాపాకు పూర్తి మద్దతుగా నిలుస్తారని, చంద్రబాబు చేసిన అవినీతి, మోసాలను మరిచిపోలేరని అన్నారు. ఇప్పటికే తాము ఏం కోల్పోయామో ప్రజలు స్పష్టంగా తెలుసుకోగలుగుతున్నారన్నారు. అనంతరం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో నేతలు ప్రత్యేకంగా సమావేశమై రాబోయే దశల్లో పార్టీ బలోపేతంపై కార్యాచరణను రూపొందించారు. కేడర్ అంతా ఒక్కటిగా ఉంటేనే మరోసారి జగనన్నను ప్రజా శ్రేయస్సు కోసం నిలుపుకోగలమని నేతలు పునరుద్ఘాటించారు.



# 8మంది అనాథ పిల్లలకు వెంటనే ఆధార్ కార్డులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం))

శ్రీకాకుళం జిల్లాలో ఆధార్ కార్డులు లేని ఎనిమిది మంది అనాథ పిల్లలను గుర్తించామని, వారికి వెంటనే ఆధార్ కార్డులు జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు వెల్లడించారు. ఈ మేరకు ఆయన స్థానిక అధికారులతో ఒక సమావేశం నిర్వహించి, వారికి అవసరమైన సహకారం అందించాలని కోరారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, ఆధార్ లేని నిరాశ్రయులైన పిల్లల కోసం జిల్లాలో ఒక ప్రత్యేక సర్వే చేపట్టారు. ఈ సర్వే ప్రధాన లక్ష్యం అనాథ పిల్లలకు చట్టపరమైన గుర్తింపు కల్పించి, వారిని ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అనుసంధానించడమే. ఆధార్ కార్డు లేకపోవడం వల్ల వారికి విద్య, వైద్యం, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలు అందడం లేదని హరిబాబు పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా మార్గదర్శకత్వంలో జరిగిన ఈ సమావేశంలో శ్రీకాకుళం తహసీల్దార్ ఎస్. గణపతి రావు, జిల్లా ఆసుపత్రి జాయింట్ డైరెక్టర్ బి. రాజశేఖర్‌రెడ్డి, వన్‌స్టాప్ సెంటర్, మున్సిపాలిటీ అధికారులు, ఇతర సంబంధిత విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు. తహసీల్దార్, జాయింట్ డైరెక్టర్, మున్సిపాలిటీ అధికారుల సహకారంతో ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని హరిబాబు వివరించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ జి. ఇందిరా ప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే ప్రజాదర్బార్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


నియోజకవర్గంలో ప్రజలు వారి సమస్యలను నేరుగా తమ దృష్టికి తెస్తే సమస్య పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శుక్రవారం విశాఖ ఏ కాలనీ పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. శ్రీకాకుళం, గార శ్రీకాకుళ పట్టణంలోని ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులు సంప్రదించి సమస్య పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వములో ప్రజా సమస్యలకే పెద్దపీట వేస్తున్నామని, ఎవరికి ఏ సమస్య వచ్చినా నిరభ్యంతరంగా వారి సమస్యలను తెలపవచ్చని ఆయన తెలిపారు. సమస్యలు పరిష్కరించడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు ఈ ప్రజా దర్బార్‌కు అధిక సంఖ్యలో మహిళలు ప్రజల వచ్చి సమస్యలపై వినతులు అందజేశారు.



## మిస్టర్ ఆంధ్రబాడీ బిల్డింగ్ పోటీలకు క్రీడాకారులు ఎంపిక

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


ఈనెల 13వ తేదీన కడపలో మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలు జరగనున్నాయని, ఈ పోటీలకు మన జిల్లా నుంచి పలువురు ఎంపికైనట్లు శ్రీకాకుళం స్టార్ బాడీబిల్డింగ్ అసోసియేషన్ సెక్రటరీ వి.విజయ కుమార్ తెలిపారు. ఎంపికైన వారిలో అవినాష్ 60కేజీలు, పలాస శివ 65కేజీలు, పలాస బ్రహ్మం 75కేజీలు పలాస వైకుంఠం 55కేజీలు, శ్రీకూర్మం ప్రేమ్‌కుమార్ 55కేజీలు, ఆమదాలవలస కోటేశ్వరరావు 60 కేజీలు, శ్రీకాకుళం రాకేష్ 65కేజీలు, రాజు90కేజీలు, శ్రీకాకుళం దిలీప్ 50కేజీలు శ్రీకాకుళం ఉన్నారన్నారు. ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత సూర శ్రీనివాస్ ముఖ్య అతిధిగా పాల్గొని వారిని అభినందించారు. కార్యక్రమంలో ది ఆంధ్ర బాడీబిల్డర్స్ అసోసియేషన్ కె గౌరీ శంకర్, పవర్ హౌస్ జిమ్ అధినేత రాజు, శ్రీకాకుళం సీనియర్ బాడీబిల్డర్ దుమ్ము అప్పన్న, పలువురు బిల్డర్స్ పాల్గొన్నారు.



# పైడి వేణుగోపాలంకు సత్కారం


(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బీజేపీ యువమోర్చా శ్రీకాకుళం జిల్లా ఆధ్వర్యంలో బిజెపి నేషనల్ కౌన్సిల్ మెంబర్‌గా ఎన్నికైన పైడి వేణుగోపాలంను దుశ్శాలువాతో సన్మానించారు. జ్ఞాపికను అందించిన అనంతరం బీజేవైఎం జిల్లా అధ్యక్షులు బూరె నరేంద్ర చక్రవర్తి జిల్లా యువ మోర్చా తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కష్టపడి పనిచేసే నాయకులకు భారతీయ జనతా పార్టీ ఇటువంటి గుర్తింపు ఇస్తుందని తెలియజేశారు. రానున్న రోజుల్లో భారతీయ జనతా పార్టీలో పెద్ద ఎత్తున చేరికలు జరుగుతాయని, దేశ వ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ యువతకి మంచి ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. కనుక దేశ సేవ చేయాలని ఆలోచనతో రాజకీయ రంగంపై అభిరుచి ఉన్న యువత భారతీయ జనతా పార్టీలో చేరాలన్నారు. బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జల రాజు, వెంకట్, యువ నాయకులు సాయికుమార్, శ్రీను, రాంజీ తదితరులు పాల్గొన్నారు.





పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ వాటిని అధికారులతో పరిష్కార దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రజా దర్బార్‌లో కూటమి ప్రభుత్వానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. - సత్యంన్యూస్, పాతపట్నం




విశాఖపట్నం కలెక్టరేట్‌లో రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అధ్యక్షతన పీయూసీ కమిటీసభ్యులు, వివిధ విభాగాలకు చెందిన అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వీఎంఆర్డీయే, ఏపీఐఐసీ, ఏపీ టూరిజం, ఏపీ మెడ్‌టెక్ జోన్ లిమిటెడ్, శ్రీకాకుళం స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్, గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటీ లిమిటెడ్ ప్రతినిధులు పాల్గొని వారి వార్షిక నివేదిక వినిపించారు. - సత్యంన్యూస్, విశాఖపట్నం.

# కొత్త డిపో ఏర్పాటుకు ఇచ్చిన ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి కొత్త డిపో ఏర్పాటుకు ఇచ్చిన ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో హమాలీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.బంగార్రాజు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏపీ స్టేట్ బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటుకు ఇచ్చిన ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని, హమాలీల ఉపాధిని కాపాడాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్&బి కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించి అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎచ్చెర్ల మండలం ఎచ్చెర్లలో 100 మంది దళిత కుటుంబాలకు చెందిన 4ఎకరాలు భూములను 1986లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని ఎచ్చెర్లలో యారక్ బాటిలింగ్ యూనిట్ ఏర్పాటు చేసి సారా తయారీ కేంద్రంలో దళిత కుటుంబాల వారికి కార్మికులుగా, హమాలీలుగా ఉపాధి కల్పించారన్నారు. అప్పటి ప్రభుత్వ సారా తయారీ నుంచి ఇప్పుడు ఏపీ బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్, ఐయంఎల్ డిపోగా నడుస్తున్న దీనిలో 80మంది హమాలీలుగా లోడింగ్, అన్ లోడింగ్




పనులు పనిచేస్తూ రోజువారీ వచ్చే ఆదాయంపైనే కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయన్నారు. ఉమ్మడి జిల్లాలో ఒక డిపోగా కొనసాగుతున్న దాన్ని విడగొట్టి ఇప్పుడు కొత్తగా మరో డిపో ఏర్పాటు ఏర్పాటు అవసరం లేదన్నారు. అనంతరం జేసీ ఫర్హాన్ అక్తర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వి.రమణ, కోశాధికారి అల్లు సత్యనారాయణ, ఏపీబీసీఎల్ హమాలీస్ యూనియన్ నాయకులు నిడిగంట్ల రమణ, గజినీ శ్రీనివాసరావు, లండ సీతారాం, లింగాల రాము, సొంట్యాన శ్రీనివాసరావు, నవిరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పనిచేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను
CONTACT
9440001447, 8341163666

# ఆ 'మందు' పోస్తేనే.. ఈ మందులు ఇస్తాం!

(మొదటిపేజీ తరువాయి)


ఆడుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**మందులివ్వాలంటే డబ్బులు ముట్టాలి**

కేంద్రానికి వైద్యసేవల కోసం వచ్చే రోగులకు డబ్బులివ్వనిదే మందులు ఇవ్వడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఇద్దరు కౌన్సెలర్లే కుమ్మక్కై ఇతర ఉద్యోగులను సైడ్ చేసేసి పెత్తనం చెలాయిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. మందుల కోసం వచ్చే ఎక్స్ సర్వీస్‌మెన్‌ను వారికి మిలటరీ కోటాలో అందే మద్యం బాటిల్ ఇవ్వాలని అది కాకపోతే రూ.వెయ్యి ఇవ్వాలని డిమాండ్ చేసి మరీ వసూలు చేస్తున్నారని తెలిసింది. అలా ఇవ్వకపోతే ప్రతి నెలా ఇవ్వకుండా రెండు మూడు నెలలకోసారి మొక్కుబడిగా మందులు ఇస్తున్నారు. ప్రతినెలా ఇస్తున్నట్లు చూపించి వాటిని బయట పేషెంట్లకు అమ్ముకుంటున్నారని తెలిసింది. కొన్ని సందర్భాల్లో మెడిసిన్ స్టాక్ ఉన్నా లేదని చెప్పి మూడు నాలుగు వేలు వసూలు చేసిన తర్వాత ఇస్తున్నారు. ఈ మందులు చాలా ఖరీదైనవి కావడంతో బయట మార్కెట్‌లో కొనలేక ఈ ఇద్దరు చెప్పినట్లు డబ్బులు సమర్పించుకోవాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. ఇక కొందరు ఇక్కడ ట్రీట్‌మెంట్ తీసుకున్న తర్వాత ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతుంటారు. కానీ మందులు, కౌన్సెలింగ్ కోసం వారు ఇక్కడికే రావాల్సి ఉంటుంది. అటువంటి రోగులతో వీరు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. వారి నుంచి ప్రతినెలా రూ.రెండు వేలు చొప్పున తీసుకుని అవసరమైన మందులను ఈ కౌన్సెలర్లే పోస్టు లేదా కొరియర్ ద్వారా పంపిస్తున్నట్లు తెలిసింది. ఉదాహరణకు ప్రస్తుతం నెల్లూరులో ఉంటున్న ఒక పేషెంట్ గత జనవరిలో కేంద్రానికి వచ్చి మందులు తీసుకున్నారు. మళ్లీ ఆయన ఫిబ్రవరిలో రావాలని అతని అటెండెన్స్ కార్డులో వైద్యాధికారి నమోదు చేశారు. కానీ ఆరు నెలలుగా సదరు పేషెంట్ రాలేదు. అయినా ఆయనకు ప్రతినెలా ఠంచనుగా మందులు చేరిపోతున్నాయి. రోగులు ఇచ్చే రోగుల నుంచి ఎక్కువ బ్లడ్ శాంపిల్ తీసుకుని.. దానిలో కొంత కేంద్రానికి రాకుండా తమ ద్వారా మందులు పొందుతున్నవారి బ్లడ్ శాంపిల్‌గా నమోదు చేసి తప్పుడు రిపోర్టులు ఇస్తున్నారని తెలిసింది.

**ఆగడాలకు అంతులేదు**

మందుల పంపిణీలోనే కాకుండా చాలా విషయాల్లో ఆ ఇద్దరు కౌన్సెలర్లు రెచ్చిపోతున్నారు. తమకంటే తక్కువ సర్వీసు ఉన్న కేంద్రం మెడికల్ ఆఫీసర్‌ను లెక్క చేయకుండా ఆయన్ను వేధిస్తున్నట్లు తెలిసింది. ఆయనుకు తెలియకుండా మందులు ఇవ్వడం, రక్తం శాంపిల్స్ మర్చేడం వంటివి చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో మద్యం సేవించి వచ్చి రోగులను దూషిస్తుంటారు. ఉచితంగా ఇవ్వాల్సిన మందులను తమ లంచ్ బ్యాగుల్లో పెట్టి అక్రమంగా బయటకు తీసుకెళ్లి అమ్ముకుంటున్నట్లు తెలిసింది. ఏఆర్టీ కేంద్రానికి ఒంటరిగా వచ్చే మహిళలతో పరాచకాలాడుతూ, హేళన చేయడంతోపాటు అసభ్యకరంగా ప్రవరిస్తున్నారని తెలిసింది. అలాగే రోగుల్లో ఎవరికైనా హైవే, పట్టణ ప్రాంతాల్లో స్థలాలు, భూములు ఉన్నాయని తెలిస్తే వారిని బెదిరించి తక్కువ ధరకు వాటిని కొట్టేస్తున్నారు. దానికి అంగీకరించకపోతే గోప్యంగా ఉంచాల్సిన వారి వ్యాధి వివరాలను బయటపెడతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిసింది. కేంద్రానికి వచ్చే హెచ్ఐవీ పెషెంట్లను మేనేజ్ చేసి బయట డాక్టర్ల వద్దకు పంపుతూ వారి నుంచి కూడా కమీషన్లు తీసుకుంటున్నారని తెలిసింది. గతంలో నేతాజీ శ్రీకాకుళం ఏఆర్టీలో పని చేసినప్పుడు వైజాగ్ నుంచి ఆయుర్వేద మందులు తెప్పించి రోగులకు బలవంతంగా అంటగట్టి వేల రూపాయలు వెనకేసుకున్నారు.



నెల్లూరు పేషెంట్ అటెండెన్స్ కార్డు

**ఏపార్టీ ఉంటే ఆ పార్టీ పంచన చేరి..**

చాలా ఏళ్లుగా జిల్లాలోనే పని చేస్తున్న ఈ ఇద్దరు కౌన్సెలర్లు ప్రభుత్వ ఉద్యోగులమన్న విషయం మర్చిపోయి రాజకీయంగానూ ఆటలాడుకుంటున్నారు. గతంలో శ్రీకాకుళం ఏఆర్టీలో పని చేసిన పైలా వెంకటరమణ(నేతాజీ) 2022 జూలైలో టెక్కలి ఏఆర్టీకి బదిలీ అయ్యి అక్కడే కొనసాగుతున్నారు. టెక్కలిలోనే నిన్నటి వరకు పని చేసిన పీపీటీసీటీ కౌన్సెలర్ సురేస్ గత నెలే తాత్కాలిక ప్రాతిపదికన కోటబొమ్మాళి ఐసీటీసీకి బదిలీ అయ్యారు. దీరిద్దరూ రాజకీయాలను కూడా తమకు అనువుగా వాడేసుకుంటున్నారు. ఒకప్పుడు కాంగ్రెస్‌లో కణితి విశ్వనాథం అనుచరులుగా ఉన్న వీరు వైకాపా హయాంలో ఆ పార్టీతో అంటకాగారు. ఆ ప్రభుత్వం అచ్చెన్నాయుడును అరెస్టు చేసినప్పుడు ఆయనకు వ్యతిరేకంగా రెచ్చిపోయారు. సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన పోస్టులు పెట్టారు. కానీ రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత టీడీపీ పంచన చేరిపోయారు. మంత్రి అచ్చెన్నాయుడు వెంట తిరుగుతూ నాడు దూషించిన నోటితోనే ఇప్పుడు పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు. మంత్రితో తమకు సత్సంబంధాలు ఉన్నాయని చెప్పుకొంటూ రెచ్చిపోతున్నారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీ శాక్స్) ఇన్‌ఛార్జి ఏపీడీగా ఉన్న కామేశ్వరప్రసాద్ ప్రాపకం కూడా వీరికి లభించింది. గతంలో ఇక్కడ డీపీఎంగా ఉండి అవినీతి ఆరోపణలతో వెళ్లిపోయిన ఉమామహేశ్వరరావును మళ్లీ ఇక్కడికి తీసుకువచ్చేందుకు అలాగే ఊస్టింగ్ పొందిన ఛైల్డ్ ఫండ్ ఇండియా డీఆర్పీ హనుమంతు నాగభూషణరావును మంత్రి అచ్చెన్న, ఏపీడీ కామేశ్వర ప్రసాద్‌ల ద్వారా మళ్లీ వెనక్కి రప్పించి, ఆయా పోస్టుల్లో కూర్చుబెట్టేందుకు కూడా వీరు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. వీరి పరపతిని చూసి ఫిర్యాదు చేసేందుకు కూడా బాధితులు భయపడుతున్నారు. ఒక బాధితుడు ధైర్యం చేసి సుమారు ఏడాది క్రితం ఏపీశాక్స్‌కు ఫిర్యాదు చేస్తూ మెయిల్ పంపినా దానిపై ఇంతవరకు చర్యలు లేకపోవడం కూడా బాధితుల వెనుకంజకు కారణం.



## శాకంబరిగా సంతోషిమాత

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పాతశ్రీకాకుళంలోని శ్రీ సంతోషిమాత అమ్మవారి ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా శాకాంబరీ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈమేరకు శుక్రవారం అమ్మవారిని సుప్రభాత సేవ, క్షీరాభిషేకం సేవ అనంతరం శాకాంబరీ దేవిగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పలు రకాల ఫలాలతో అమ్మవారిని అలంకరించారు. ప్రతి మానవుడు అన్న పానాలకు లోటు లేని జీవితం పొందాలని అమ్మవారిని కోరుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కార్యనిర్వహణ అధికారిణి మునగవలస సుకన్య, దేవస్థానం సిబ్బంది చర్యలు తీసుకున్నారు.

## జీతాలు పెంచేవరకు పోరాడుతాం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జీతాలు పెంచేవరకు పోరాడతామని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు అన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మున్సిపల్ పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని శుక్రవారం నిరసన తెలిపారు. మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కళ్యాణి అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పని చేస్తున్న ఆఫీస్ సిబ్బందికి, టౌన్ ప్లానింగ్ సిబ్బందికి, పంప్ ఆపరేటర్లకు, ఎలక్ట్రిషన్లకు కనీస వేతనాలు అమలు చేయాలని, గత సమ్మె కాలపు నాటి జీవోలు విడుదల చేయాలని, ఔట్సోర్సింగ్ కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమపథకాలు అందివ్వాలని, మున్సిపల్ పర్మినెంట్ కార్మికులకు




సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఆర్డీఏలు వెంటనే విడుదల చేయాలని కోరారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ విస్తీర్ణంకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచి పని భారం తగ్గించాలని, స్థానిక సమస్యలపై కార్మిక సంఘాలతో చర్చలు జరిపి ఒక్కో సమస్య పరిష్కారం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం పరిపాలన విభాగ అధికారి జి.ఎ. సూర్యనారాయణకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జె.గురుమూర్తి, పార్థసారథి, గణేష్, మనీ, రసూల్, సోషల్ మీడియా ప్రతినిధులు కళ్యాణి తిరుమలరావు, అరుగుల రమణ పాల్గొన్నారు.

### డాలర్‌కు ప్రత్యామ్నాయ పరిస్థితి..

# అమెరికా స్వయంకృతాపరాధమే



**సత్యం ఐటీడెస్క్:** ప్రత్యర్థి దేశాలను బెదిరించేందుకు అమెరికా చేపట్టే ఆర్థిక చర్యలే.. వాటిని డాలర్ ప్రత్యామ్నాయం వైపు నెడుతున్నట్లు గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటీవ్ సంస్థ అభిప్రాయపడింది. ముఖ్యంగా అంతర్జాతీయ పేమెంట్స్ వ్యవస్థ స్విఫ్ట్‌ను ఉపయోగించకుండా నిషేధానికి గురైన రష్యా, ఇరాన్, వెనుజువెలా వంటి దేశాలు డాలర్లలో చెల్లింపుల స్వీకరణను నిలిపేసేలా చేసిందని వెల్లడించింది. దీంతో భారత్, చైనా వంటి దేశాలు వాటి కరెన్సీల్లోనే ట్రేడింగ్ చేస్తున్నాయని పేర్కొంది. డాలరేతర కరెన్సీల్లో ట్రేడింగ్ చేస్తున్నందుకు బ్రిక్స్ దేశాలపై 10 శాతం పన్నును ట్రంప్ ప్రతిపాదించారు. వాషింగ్టన్ ఒంటెద్దు పోకడల వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్న విషయాన్ని గుర్తించడం లేదని జీటీఆర్ఐ శుక్రవారం వెల్లడించింది. 'వివిధ దేశాలు డాలర్ నుంచి దూరంగా జరగడం తిరుగుబాటు కాదు. వారికి మిగిలింది అదొక్కటే మార్గం. రష్యా-చైనాల మధ్య 90 శాతం వాణిజ్యం రూబుల్ లేదా యువాన్‌లలో జరుగుతోంది. భారత్ రూపాయలు, దిర్హామ్‌ల్లో రష్యా చమురు కొనుగోలు చేసినందుకు గాను చెల్లింపులు చేస్తోంది. చివరికి పెట్రో డాలర్ ఒప్పందం చేసుకొన్న సౌదీఅరేబియా కూడా డాలరేతర చమురు వ్యాపారానికి తెర తీసింది. అమెరికా ఆంక్షలే ఆయా దేశాలను తొలుత డాలర్ ప్రత్యామ్నాయాలు వెతికేటట్లు చేస్తోంది. ఇక బ్రిక్స్ దేశాలపై 10శాతం పన్ను.. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తే 500శాతం టారిఫ్‌లు అమెరికాతో వాణిజ్య ఒప్పందాలను మరింత జఠిలం చేస్తున్నాయి' అని జీటీఆర్ఐ అజయ్ శ్రీవాస్తవ అభిప్రాయపడ్డారు.

ప్రపంచవ్యాప్తంగా 200 దేశాల్లోని 11,000 బ్యాంక్‌లను స్విఫ్ట్ వ్యవస్థ అనుసంధానిస్తుందని శ్రీవాస్తవ వెల్లడించారు. ఇది తటస్థ వేదికగా చెబుతారు. కానీ, అమెరికా ఒత్తిడి కారణంగా ఇరాన్, వెనుజువెలా, రష్యాలకు స్విఫ్ట్ సేవలను నిలిపివేశారన్నారు. దీంతో ఈ దేశాల నుంచి చమురు, గ్యాస్ కొనేవారు.. డాలర్‌కు ప్రత్యామ్నాయాలను ఎంచుకొని చెల్లింపులు చేస్తున్నారని చెప్పారు. ఇవి ఆయా దేశాల డాలర్ వ్యతిరేక విధానాలు కాదని.. రక్షణాత్మక వ్యవస్థలని చెప్పారు. వీటిని ప్రేరేపించేవి అమెరికా ఆంక్షలే అని వెల్లడించారు.

డాలర్ల కొరత ఉన్న దేశాలతో ట్రేడ్ సెటిల్మెంట్లు రూపాయల్లో చేసుకొనేందుకు 2022లో ఆర్‌బీఐ అనుమతించింది. ఈ క్రమంలో రష్యా బ్యాంకులు చమురు చెల్లింపుల సెటిల్మెంట్లు కూడా రూపీ అకౌంట్స్‌ను తెరిచాయి. మరోవైపు బ్రిక్స్‌కు కామన్ కరెన్సీని తీసుకురావాలన్న ప్రతిపాదనను భారత్, చైనాలు తిరస్కరించాయి. స్థానిక కరెన్సీల్లో ట్రేడింగ్ చేసుకొంటే.. డబుల్ డాలర్ కన్వెర్షన్లను తప్పించుకోవచ్చు.. అప్పుడు కనీసం 4శాతం వరకు అయ్యే ఖర్చు ఆదా అవుతుందని జీటీఆర్ఐ నివేదికలో అభిప్రాయపడింది. ఈవిషయాన్ని ఆయా దేశాలు గ్రహించేకొద్దీ స్థానిక కరెన్సీల్లోనే ట్రేడింగ్ జరుగుతుందని వెల్లడించింది.

# కాలేజీ ఆటస్థలం చదును చేసిన ఎస్ఎఫ్ఐ

- ప్రభుత్వ స్థలంగా నిర్ధారించిన రెవెన్యూ అధికారులు
- ఆక్రమణలను తొలగించిన విద్యార్థులు



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

నియోజకవర్గం పరిధిలోని జి.సిగడాంలోని సర్వే నెంబర్ 150/1లో 1.5 ఎకరాల భూమి ప్రభుత్వ జూనియర్ కాలేజీకి చెందిన ఆటస్థలం దురాక్రమణపై ఎస్ఎఫ్ఐ చేసిన పోరాటం ఫలించింది. దీన్ని కాలేజీకి అప్పగించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఎప్పటి నుంచో ఆందోళన చేస్తున్నారు. దీనిపై స్థానికులతో కలిసి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ అధికారులు పోలీసులు సమక్షంలో సర్వే చేసి కాలేజీకి చెందిన స్థలంగా నిర్ధారించి హద్దులు ఏర్పాటు చేశారు. దీంతో శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు, స్థానికులతో కలిసి కాలేజీ విద్యార్థులు స్థలంలోని ప్రైవేట్ వ్యక్తులకు చెందిన గడ్డివాము, కర్రలను తొలగించి చదును చేశారు. ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఆటస్థలాన్ని ఎన్నో ఏళ్లుగా హరినాథ్ బాబా అనే వ్యక్తి ఆక్రమించినట్టు ఎస్ఎఫ్ఐ ఆరోపిస్తూ వచ్చింది. దీనిపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జూనియర్ కాలేజ్ ఎదుట పెద్దఎత్తున ఆందోళన చేశారు. తహసీల్దారు, స్థానిక ఎస్ఐ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి ఆటస్థలాన్ని కాలేజీకి అప్పగించారు. దీంతో ఆటస్థలాన్ని చదును చేసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.పవిత్ర, డి.చందు మాట్లాడుతూ కొత్త సర్వే నెంబర్ 150/1లో కళాశాలకు చెందిన 1.50 ఎకరాల ఆటస్థలాన్ని వి.హరినాథ్ బాబా కబ్జా చేశారన్నారు. మండలానికి చెందిన 200 విద్యార్థులు ఈ కళాశాలలో చదువుతున్నారని, వీరికి మానసిక ఆరోగ్యం పెంపొందేందుకు, చదువు, క్రీడల్లో రాణించేందుకు క్రీడా ప్రాంగణం ఎంతో ముఖ్యమన్నారు. 2018 ఏప్రిల్ 12న శ్రీకాకుళం జిల్లా కోర్టులో లోక్ అదాలత్ ఈ స్థలం ప్రభుత్వ జూనియర్ కళాశాలకే చెందినదని తీర్పు ఇచ్చినా అధికారులు పట్టించుకోలేదని, కళాశాల స్థలాన్ని ఆక్రమించడం వల్ల విద్యార్థులు ప్రార్ధన చేయడానికి, సైకిల్ పార్కింగ్ చేసుకోవడానికి, రాకపోకలు సాగించడానికి అవకాశం లేకుండా పోయిందన్నారు. విద్యార్థులను ఇబ్బందికి గురిచేస్తున్న ఆక్రమణదారుడు ఉపాధ్యాయులు, విద్యార్థులను బెదిరిస్తున్నా ఎవరూ నిలదీసే ప్రయత్నం చేయలేదని, దాతల ద్వారా సంక్రమించిన





స్థలాన్ని విద్యార్థుల అవసరాలకు కాకుండా ప్రైవేట్ వ్యక్తి చేతిలో ఉండిపోయిందన్నారు. ఎస్ఎఫ్ఐ కృషి వల్ల ఈ స్థలం కాలేజీకి దఖలుపడిందని, దీనికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.ఖగేష్, ఉపాధ్యక్షులు ఎం.సంతోష్, సిహెచ్ రాజు, జిల్లా కమిటీ సభ్యులు చిన్న, జయరాం, ఆర్ట్స్ కాలేజ్ కమిటీ సభ్యుడు టి.తిరుపతి, జి.సిగడాం మండల నాయకులు పవన్, భార్గవ్, సాయి, వంశి తదితరులు పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.